క్లుప్తంగా

విద్యా పరికరాలు పంపిణీ

సోంపేట: కర్తలిపాలెం ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మదనాల ఆనంద్‌కుమార్, లోకేష్, కిరణ్‌కుమార్‌లు విద్యా పరిపకరాలను సమకూర్చారు. ఉన్నత పాఠశాలకు చెందిన 121 మందికి, ప్రాథమిక పాఠశాలకు చెందిన 77 మందికి శనివారం పంపిణీ చేశారు.

కలెక్టర్ ఆదేశాలతో పారిశుద్ధ్య పనులు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇటీవల పర్యటించి పారిశుద్ధ్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బైరవీధిలోని కాలువలను పరిశీలించి ఇలాగేనా పారిశుద్ధ్య నిర్వహణ అని మండిపడ్డారు. తక్షణమే కాలువలను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి ఎ.వి.శ్రీనివాసరావును ఆదేశించారు. దీంతో పంచాయతీ యంత్రాంగం స్పందించి రెండు రోజులుగా బైరవీధితో పాటు ఆదిఆంధ్రవీధి, భవానీనగర్ వీధుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ముగిసిన ఏడు శనివారాల వ్రత దీక్షలు

కవిటి: లోళ్లపుట్టుగలోని కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో ఏడు శనివారాల వ్రత దీక్షల ఉజ్జాపన ఉత్సవం వైభవంగా ముగిసింది. శ్రావణ మాసం మొదటి శనివారం నుంచి ప్రారంభమైన దీక్షలు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 200 జంటలు చేపట్టారు. వ్రతాలు అర్చకులు అప్పలస్వామి, వెంకటరమణ స్వామి ఆధ్వర్యంలో జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఫ్యాన్లు, కుర్చీలు వితరణ

ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురం ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన తిప్పన ధనుంజయరెడ్డి, దూపాన సూకరాజులు ఆరు కుర్చీలతో పాటు రెండు ఫాన్‌లు అందజేశారు. శనివారం పాఠశాలలో పేరెంట్స్‌తో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపాధ్యాయులకు వీటిని అందించి ఔదర్యాన్ని చాటుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు, సహోపాధ్యాయురాలు ధనలక్ష్మి, శ్రావణిలను సత్కరించారు.

కూపన్ల ద్వారా యూరియా పంపిణీ

సోంపేట: వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో రైతు సేవా కేంద్రాల ద్వారా కూపన్ల పద్ధతిలో యూరియా సరఫరా చేస్తామని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవాని శంకరరావు తెలిపారు. శనివారం మండలంలోని బెంకిలి, బారువ, సోంపేట రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేశారు.

రిటైర్డు ఆర్మీ ఉద్యోగికి సన్మానం

కంచిలి: మకరాంపురం గ్రామానికి చెందిన వజ్జ గోపి ఆర్మీలో హవల్దార్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. గ్రామానికి చేరుకున్న ఆయనను స్థానిక షిర్డీసాయి మందిరంలో శనివారం దుశ్శాలువతో సత్కరించి ఘనంగా సత్కరించి గౌరవించారు. దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆలయ ధర్మకర్త రమణ సాయి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

మూలకుచేరిన కియోస్క్‌లు!

- పలాస నియోజకవర్గంలో నిరుపయోగంగా 58 యంత్రాలు
- పనిచేయని సర్వర్లు, నిలిచిపోయిన ఆన్‌లైన్ సేవలు
- కొత్త యాప్‌లో అరకొర సేవలు



పాతటెక్కలిలో మూలకు చేరిన కియోస్క్ యంత్రం

వజ్రపుకొత్తూరు:

రైతు సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్షసాధింపులో భాగంగా నిర్వీర్యం చేసే దిశగా అడుగులేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా రైతులు వారి గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులతో పాటు వారికి అవసరమైన సేవలు అందించేందుకు గత ప్రభుత్వం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసింది. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు కోసం సమకూర్చిన కియోస్క్‌లు మూలన పడ్డాయి. పలాస నియోజకవర్గంలోని బెండి, వజ్రపుకొత్తూరు, పాతటెక్కలి, సైనూరు, దేవునల్తాడతో పాటు మందస, హరిపురం, బాహాడపల్లి, పెదంచల, చినబడాం, బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురంతోపాటు 58 రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు పని చేయడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను రద్దు చేస్తుండగా మరికొన్నింటికి పేర్లు మార్చేసింది. గతంలో రైతు భరోసా కేంద్రాలుగా ఉన్న వాటిని ప్రస్తుత సర్కార్ రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారు. రైతులకు కావాల్సిన వ్యవసాయ సేవలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు వీలుగా కియోస్క్ యంత్రాలను ఆర్‌ఎస్కేల్లో ఏర్పాటు చేసింది.

పీఎంఏఐడీ యాప్‌తో మూలకు..

పలాస నియోజకవర్గంలో 58 రైతు సేవా కేంద్రాలు ఉండగా అందులో అదే సంఖ్యలో కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సేవా కేంద్రాల్లో ప్రస్తుతం కియోస్క్‌లకు బదులుగా పీఎంఏఐడీ యాప్‌ను తీసుకువచ్చి కియోస్క్‌లను నిరుపయోగం చేశారు. రైతులకు కావాల్సిన ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, మార్కెటింగ్, నగదు లావాదేవీలు, అవసరమైన ప్రతిపాదనలు పంపడం వంటి సేవలు ఆన్‌లైన్‌లో పొందేందుకు గత ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. దీంతో అందులోనే అన్ని రకాల సేవలను రైతులు పొందేవారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, పంటల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, సూచనలు, సమాచారం వీడియోలను తిలకించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వర్లు పనిచేయక.. ఇంటర్‌నెట్ సేవలు అందక సేవలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న యాప్‌లో కూడా అరకొర సేవలు అందుతున్నాయని రైతులు వాపోతున్నారు.

వినియోగంలోకి తేవాలి



కియోస్క్‌ల వల్ల చాలా ఉపయోగం పొందాం. పుష్కలంగా ఎరువులు, విత్తనాలు పొందడమే కాకుండా మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకునేవాళ్లం. ఖరీఫ్ వరిలో వచ్చే తెగుళ్లు, చీడపీడల నివారణ చర్యలు, యాజమాన్య పద్ధతులు తెలుసుకునేవాళ్లం.నేడు ఆ పరిస్థితి లేదు. రైతులకు అవసరమైయ్యే కియోస్క్‌లు వినియోగంలోకి తేవాలి.

– బి.ధర్మారావు, రైతు, రెయ్యినాడు

వినియోగంలో లేవు

పీఎంఏఐడీ యాప్ వచ్చాక కియోస్క్‌లు అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం వర్కింగ్ కండిషన్‌లో ఉన్నా ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగానే ఉన్నాయి. మొబైల్ యాప్ వచ్చాక అందులో సేవలు ఎక్కువగా ఉన్నాయి. విత్తనాలు పంపిణీ పూర్తయ్యాక కియోస్క అవసరం లేకుండానే పోయింది. ఏమైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

– ఎం.రామారావు, ఏడీఏ పలాస



కొమరల్తాడలోని రైతు భరోసా కేంద్రం

నేత్రదానంపై అవగాహన



40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. టెక్కలి డివిజన్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ మేరీ కేథరిన్ మాట్లాడుతూ.. ఆరోగ్య, ఆశ కార్యకర్తలు గ్రామాలను సందర్శించేటప్పుడు నేత్రదానంపై ఉన్న అపోహలు తొలగించి మరణానంతరం నేత్రదానం చేయడానికి ప్రజలు ముందుకు వచ్చేటట్లు ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత, రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారులు పరిమళ, ఎస్.నందిని, ఆప్తాలమిక్ అధికారి ఎం.ఆర్.కె. దాస్, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.వి.గోవిందరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.మోహనరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి

మహిళల రక్షణకు చర్యలు



మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటప్పారావు చెప్పారు. కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్ కళాశాలలో శక్తి యాప్‌పై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో శక్తియాప్ మహిళలకు రక్షణగా ఉంటుందన్నారు. మహిళల భద్రత, రక్షణ కోసం దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ దానేటి పద్మజ, సిబ్బంది ఉన్నారు.

–పలాస

సత్కారం



వజ్రపుకొత్తూరు మండలం గరుడబద్ర ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదేళ్ల విధులు నిర్వర్తించి బదిలీ అయిన ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఐ.రమేష్ కుమార్‌లకు అదే పాఠశాలలో శనివారం గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ గిరిజ, ప్రధానోపాధ్యాయులు భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు గూడ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు సుజాత, సరస్వతి, గ్రామ పెద్దలు కె.మోహన్‌రావు, వై.జోగారావు, టి.ప్రవీణ్, ఎ.ధనరాజు, టి.ప్రకాశ్, ఎల్.నారాయణ ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

అధికారులు గైర్హాజరు–సభ్యుల ఆగ్రహం

- ఎరువుల కొరతపై ఆందోళన
- మందస మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

మందస: సమస్యలు, అభివృద్ధిపై సమీక్షించే మండల సమావేశాలకు అధికారులు గైర్హాజర్ కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఎరువుల కొరతపై నిలదీశారు. మందస మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షత శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగింది. అయితే సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కాక పోవడంతో సభ్యులు మండిపడ్డారు. అధికారులు రాని సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు రాకుండా దిగువస్థాయి ఉద్యోగులను సమావేశాలకు పంపిస్తూ ప్రజాప్రతినిధులను తక్కువ చేస్తున్నారని ఎంపీపీ దానయ్య అన్నారు. గతంలో జరిగిన సమావేశాలకు కూడా హాజరు కాని వ్యవసాయ అధికారి నాగరాజు ప్రజాప్రతినిధులు ఫోన్ చేసి పిలిస్తే చివర్లో వచ్చారు. దీంతో సభ్యులంతా యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని ఆరోపించారు. దీనికి వ్యవసాయాధికారి బదులిస్తూ ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలి వెళ్లలేదని స్పష్టం చేశారు. ఇండెంట్ మెరకు వచ్చిన ఎరువులను రైతులకు సక్రమంగా పంపిణీ చేశామన్నారు. విద్యుత్ సమస్యలు వినియోగదారులను వెంటాడుతున్నాయని.. వాటిని పరిష్కరించాలని వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ కోరారు. చాలా గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని, వీధి దీపాలు రోజంతా వెలుగుతున్నా పట్టించుకోవడం లేదని ప్రసాద్‌తోపాటు పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే గౌతు శిరీష 1400 ఎకరాలను కార్గో ఎయిర్ పోర్టు పేరుతో ధ్వంసం చేయడం పర్యావరణాన్ని పరిరక్షించడమాని వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ ప్రశ్నించారు. హరిపురం నుంచి మందస వచ్చే జంక్షన్ రోడ్డు 80 అడుగుల నుంచి 40 అడుగులకు కుసించుకుపోయిందని.. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టి పరిక్షించాలని సభ్యులు కోరారు. సమావేశంలో ఎంపీడీవో వై.వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో తిరుమల కూమార్, ఏవో రుశేశ్వరావు పాల్గొన్నారు.

ఉదయం 6 గంటలకే వార్డుల్లో ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ రామారావు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస: రోజూ ఉదయం ఆరు గంటలకే వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది ఉండాలని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనరు ఎన్.రామారావు ఆదేశించారు. ఎమినిటీ, ప్లానింగ్, శానిటేషన్, ఇన్విరాల్‌మెంట్ కార్యదర్శులు, శానిటేషన్ సూపర్‌వైజర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు సిబ్బంది వార్డుల్లో ఉంటూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. పరిశీలన బృందాలు కూడా వార్డుల్లో ఉంటాయన్నారు.

వినాయక లడ్డూ @ రూ. 1.27 లక్షలు

కంచిలి: జలంత్రకోట పంచాయతీ చొట్రాయిపురం గ్రామంలో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో ప్రసాదం లడ్డూకు శుక్రవారం రాత్రి బహిరంగ వేలం వేశారు. కర్రి సంజీవ్, మంజు దంపతులు రూ. 1,27,116 రూపాయలకు చేజిక్కించుకొన్నారు. కార్యక్రమంలో శ్రీక్రిష్ణ యూత్ సభ్యులు సంజీవ్ పాల్గొన్నారు.

టెక్కలి: పాతనౌపడ వినాయక వీధిలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ ప్రసాదాన్ని కమిటీ సభ్యులు వేలం వేశారు. గ్రామానికి చెందిన ఏలూరు దాలయ్య రూ. 1.10 లక్షలకు కై వసం చేసుకున్నారు. సర్పంచ్ దల్లి సంధ్యారాణి, లోకేష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.అప్పలరెడ్డి పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



తేజేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఉద్యోగికి తాను అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. బిర్లంగి తోటూరు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన కాగావు తేజేశ్వరకుమార్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్న సందర్భంగా శనివారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేజేశ్వరరావు గణితం సబ్జెక్టులో విద్యార్థులకు బోధిస్తున్న తీరు అమోఘమని, ఉత్తమ అవార్డుకు అర్హులని అన్నారు. బి.తోటూరు, బిర్లంగి, సైదాలపుట్టుగ గ్రామస్తులు తేజేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సీహెచ్ ప్రమీళ, నరేంద్ర నాథ్ పట్నాయక్, వి.సరోజిని, తేజా, డి.సూర్యనారాయణ, విద్యాకమిటీ చైర్మన్ పి.ప్రకాశ్ పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



సంఘీభావం తెలుపుతున్న వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

పలాస: ఉద్దానం మంచినీటి ప్రాజెక్టులో పనిచేస్తూ తొలగింపునకు గురైన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొన్ని రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు శనివారం సంఘీభావం తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలోనే వారిని కాంట్రాక్టు కార్మికులుగా నియమించారని, 25 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని ఇప్పుడు అర్ధాంతరంగా తొలగించడం సరికాదన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన డిల్లీరావు, వంకల షణ్ముఖరావు, ఇరోతు ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

నాయకుల పరామర్శ



పరామర్శలో తమ్మినేని, తిలక్ తదితరులు

టెక్కలి: పోలవరం మాజీ సర్పంచ్ ధవళ నారాయణరావు కుమారుడు రమేష్ ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, టెక్కలి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు దువ్వాడ వాణి, దుబ్బ వెంకట్రావు, నాయకులు అన్నెపు రామారావు, ఆర్.మల్లయ్య, ఎస్.హేమసుందర్‌రాజు, కె.బాలకృష్ణారావు, కె.గోవింద్, ఆర్.జయమోహన్, జి.అప్పలరెడ్డి, పి.వెంకట్రావు, ఎ.రాహుల్, ఎం.అప్పారావు, పి.శ్రీను ఉన్నారు.

అర్హత లేకుండా వైద్యం చేస్తే చర్యలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఎలాంటి వైద్యవిద్యార్హత లేకుండా ఆస్పత్రుల నిర్వహణ చేపట్టినా, రోగులకు వైద్యం చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్ హెచ్చరించారు. దేవునల్తాడలో ఆర్‌ఎంపీ వైద్యుడు కె.లక్ష్మణరావు అర్హత లేకుండా, అనాధికారికంగా ఆస్పత్రి నడుపుతూ రోగులను మోసం చేస్తున్నారన్న సమాచారంతో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు వైద్య,ఆరోగ్య శాఖాధికారులు శనివారం దేవునల్తాడ కూడలిలో ఉన్న శారద మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌లో తనిఖీలు నిర్వహించారు. మెడికల్ షాపులో హై యాంటిబయాటిక్ ఇంజెక్షన్‌లు ఉన్నట్లు గుర్తించారు. పెద్ద ఆస్పత్రుల్లో వినియోగించే డ్రగ్స్ ఈ షాపులో లభించాయని తెలిపారు. వీటితో పాటుగా రోగులకు వినియోగించే పరుపు, ఐవీ సెంట్లు, ఇంజెక్షన్‌లు, ఖాళీ సెలెన్ బాటిళ్లు, పలు వస్తువులు మెడికల్ షాపు పరిసరాల్లో పడి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆస్పత్రిని సీజ్ చేసి లక్ష్మణరావుపై కేసు నమోదు చేస్తామని వైద్యాధికారి తెలిపారు.

‘అన్నదాత పోరు’ను విజయవంతం చేయాలి



పలాస: అన్నదాత పోరు వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు



టెక్కలి: పోస్టర్ ఆవిష్కరణలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పేరాడ తిలక్ తదితరులు

- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

పలాస: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతాంగం పట్ల అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల తొమ్మిదో తేదీన పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద ‘అన్నదాత పోరు’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి, పార్టీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పారు. ఈ మేరకు కాశీబుగ్గలోని జీఎంఆ కాలనీ వద్ద గల పార్టీ కార్యాలయం ప్రగతి భవన్ వద్ద శనివారం అన్నదాత పోరుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియాతో పాటు రైతులకు కావలసిన ఎరువులను తక్షణమే సరఫరా చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ఎరువులను పక్కతోవ పట్టిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొమ్మిదో తేదీ ఉదయం పది గంటలకు కాశీబుగ్గలోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి పలాస ఆర్టీసీ కాంప్లెక్ నుంచి ర్యాలీ, అనంతరం పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన తమ్మినేని..

టెక్కలి: యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన టెక్కలిలో నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో మాజీ స్పీకర్, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పెద్ద ఎత్తున ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులంతా కదిలి రావాలని తిలక్ కోరారు. కార్యక్రమంలో టెక్కలి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు దువ్వాడ వాణి, దుబ్బ వెంకట్రావు, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, పార్టీ మండల కన్వీనర్లు హెచ్.వెంకటేశ్వర్రావు, ఎస్.హేమసుందర్‌రాజు, బి.మోహన్‌రెడ్డి, టి.ఫాల్గుణరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యదాయకం

కవిటి: పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయ విధానం ఆరోగ్యవంతమైన సమాజానికి జీవనాధారమని ప్రకృతివ్యవసాయ శిక్షకుడు తులసయ్య అన్నారు. గొర్లెపాడు యూనిట్‌లోని శిలగం, ఖాజురు గ్రామాలలో జిల్లేడు ద్రావణం తయారీ, ప్రయోజనాలపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పైరుకు పోషకాల లోపం ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రకృతి వ్యవసాయ విధానాల్లో కీలకమైన జిల్లేడు ద్రావణాన్ని రైతులతో కలిసి తయారు చేయించామన్నారు.